క్లుప్తంగా

నార్త్ షిర్డీసాయిని దర్శించుకున్న ఏడీసీ



సాయిబాబాకు పూజలు చేస్తున్న జీవీఎంసీ ఏడీసీ సోమన్నారాయణ

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీసాయిబాబాను గురువారం జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు, చీఫ్ సెక్రటరీ ఆర్.ఎ.పాత్రో, సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఏడీసీతో సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు స్వామి, రవి, జగదీష్ పాల్గొన్నారు.

ఏయూ ఉద్యోగుల హాజరు తనిఖీ



హాజరు తనిఖీ చేస్తున్న ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాలను గురువారం కమిటీ సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోధన, బోధనేతర సిబ్బంది హాజరు, తరగతుల నిర్వహణ తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. తనిఖీల్లో రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగించుకోండి

ఆరిలోవ: ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో అందిస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగపరుచుకోవాలని ప్రిన్సిపాల్ రమణ సూచించారు. ఇక్కడ డిప్లమో అసిస్టెంట్ కేటరింగ్ మేనేజ్‌మెంట్ కోర్సులో డిఫెన్స్ ఉద్యోగులు ఆరు నెలల పాటు పొందిన శిక్షణ పూర్తయిన సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ వృత్తిపరమైన అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కోర్సు కో ఆర్డినేటర్ డాక్టర్ ఉజ్వల్‌కుమార్ ఘటక్, ఎఫ్‌సీఐ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల ప్రారంభం

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు సంజయ్‌గాంధీ కాలనీ, 13వ వార్డు దుర్గాబజార్ వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను గురువారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఆరిలోవ ప్రాంత ప్రజలకు రెండు క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. కార్యక్రమంలో 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, ఆయా వార్డుల టీడీపీ నాయకులు బుదుమూరు గోవింద్, మజ్జి రమణి, పి.ఐ.బాలరాజు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: స్వర రంజని సంగీత సాంస్కృతిక సంస్థ 35వ వార్షికోత్సవం సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం లలిత సంగీత విభావరి నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు లతా రాములు, ప్రధాన కార్యదర్శి గోల్కొండ రంగారావు, ఎంజీఎం ప్రసాద్, పి.సన్యాసినాయుడు, యోగ భాస్కర్, ఎం.అప్పారావు, చూడామణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్థ సభ్యులు 40 లలిత గీతాలను మధురంగా ఆలపించి ప్రేక్షకులను అలరించారు. బ్రహ్మాజీ, లక్ష్మీ ప్రసాద్, పద్మిని, ఎం.లక్ష్మిరెడ్డి, రూపవాణి, ఎంవీఆర్ నాగేశ్వరరావు, లక్ష్మి నాయుడు, లీలాకుమారి, చలము భాయి గీతాలు ఆలపించారు. సోమేష్ బృందం వాద్య సహకారం అందించారు.

పారిశుధ్యం.. అధ్వానం



ఇసుకతోట గెడ్డలో కుప్పలు తెప్పలుగా పూడికలు

- 16వ వార్డులో పేరుకుపోయిన చెత్త
- కానరాని గెడ్డలు, కాలువల శుభ్రత
- దోమలు, ఈగల విజృంభణతో స్థానికుల్లో ఆందోళన
- పట్టించుకోని పారిశుధ్య సిబ్బంది

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులో పారిశుధ్యం పడకేసింది. ఏ కాలువను చూసినా పూడికలు, చెత్తా చెదారంతో నిండి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. గెడ్డల పరిస్థితి మరీ ఘోరం. ఇక కాలనీ రోడ్లపై ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఈ వార్డులో పారిశుధ్య నిర్వహణను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రధాన గెడ్డ నిండా వ్యర్థాలే..

ఇటీవల కురుస్తున్న వర్షాలకు ముంపునకు గురయ్యే ప్రాంతాలు ఈ వార్డులోనూ ఉన్నాయి. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఏ కాలువలోనూ పూడిక తీసినట్టు లేదు. ఈ వార్డులో ప్రవహించే ప్రధాన గెడ్డను కోట్లాది రూపాయలతో ఆధునికీకరించినా ఏ ఫలితం లేదు. కేఆర్‌ఎం కాలనీ నుంచి ఇసుకతోట వరకు ప్రవహించే ఈ గెడ్డ వ్యర్థాలతో ఎప్పుడూ నిండిపోయి ఉంటుంది. మురుగు నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం కలుగకుండా గెడ్డ అడుగు భాగంలో కాంక్రీట్ వేశారు. ఎప్పటికప్పుడు పూడిక తీత చర్యలు చేపట్టకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోవడంతోపాటు మురుగు నీరు నిలిచిపోతోంది. గెడ్డ పరివాహక ప్రాంతంలో నివసించే కాలనీల వాసులు తమ ఇళ్లలోని చెత్తను గెడ్డలోనే పారబోయడంతో సమస్య మరింత పెరిగింది.



కాలువలో మురుగు నీటి నిల్వలు

కంపుకొడుతున్న కాలువలు

ముంపు ప్రాంతాల్లో ఒకటైన కేఆర్‌ఎం కాలనీ వీధుల్లోని కాలువలు కంపుకొడుతున్నాయి. వీటిలో ఎప్పటికప్పుడు పూడికలను తొలగించడం లేదు. పేరుకుపోయిన చెత్త, మురుగు నిల్వలతో దుర్వాసన వెదజల్లుతుంటాయి. మురుగు కాలువల పక్కగా వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి. కేఆర్‌ఎం కాలనీలో శివశంకర్ స్కూల్ నుంచి శివాలయానికి వచ్చే మార్గంలో కాలువలే ఇందుకు నిదర్శనం.



ఇసుకతోట పశు వైద్యశాల వద్ద రోడ్డుపై చెత్త కుప్పలు



కేఆర్‌ఎం కాలనీలో అధ్వానంగా కాలువ

ఈగలు, దోమల బెడద

ఇక్కడి గెడ్డలతోపాటు కాలువల్లో మురుగు నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉంటుంది. ఈ నీరు దోమలు, ఈగల ఉత్పత్తికి నిలయాలుగా మారాయి. దీంతో పగటి పూట ఈగల మోత, సాయంత్రం అయ్యేసరికి దోమల బెడదతో కాలనీల వాసులు సతమతమవుతున్నారు. కాలువలు, గెడ్డల్లోని పూడికలపై, రోడ్లపై పేరుకున్న చెత్త కుప్పలపై వాలే ఈగలు ఇళ్లలో ఆహార పదార్థాలపై వాలుతుండటంతో వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక సాయంత్రం వేళ గుంపులుగా దాడి చేసే దోమల కాటుకు గురైతే డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా వంటి జ్వరాల బారిన పడే ప్రమాదముందని భయాందోళనలు చెందుతున్నారు.

సకాలంలో పూడికలు తొలగించాలి

జీవీఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వార్డుల్లో పారిశుధ్యాన్ని మరింతగా మెరుగుపర్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఎప్పటికప్పుడు గెడ్డలు, కాలువలను శుభ్రం చేయాలని, రహదారులపై చెత్త కుప్పలు పేరుకుపోకుండా సకాలంలో తొలగించాలని సూచిస్తున్నారు. తద్వారా ప్రజలు రోగాల బారిన పడకుండా ఉంటారన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు

బీచ్‌రోడ్డు: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు, సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం నగరంలో కేంద్ర సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ మంత్రి వీరేంద్రకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, ఉత్తరాంధ్ర ఫార్మా కంపెనీలో 70 శాతం స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఫార్మా కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు పూర్తిస్థాయిలో పెంచాలని, పాటించని కంపెనీలను సీజ్ చేయాలని, రెడ్ కేటగిరీ పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలన్నారు. విభజన హామీల ప్రకారం వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్యాకేజీ నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రిని సమితి సభ్యులు కోరారు.



కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న గోవిందరావు

దివ్యాంగుల కోసం యూనివర్సిటీ ఏర్పాటుకు వినతి

మహారాణిపేట: దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఒక యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డాక్టర్ ఫోరం కన్వీనర్ డాక్టర్ ఎం.సురేష్ మీనన్ కోరారు. ప్రభుత్వ సర్క్యూట్ హౌస్ వద్ద గురువారం కేంద్ర సోషల్ జస్టిస్, ఎంపవర్‌మెంట్ శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్‌కు దివ్యాంగుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయన అందజేశారు. రాష్ట్రంలోని దళితులకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరారు.



కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ సురేష్ మీనన్

ఘనంగా సామూహిక రుద్రాభిషేకాలు

ఆరిలోవ: తోటగరువు ఎర్నిదుర్గమాంబ ఆలయ ప్రాంగణంలో చండీ సహిత సుదర్శన యాగం ఘనంగా జరుగుతోంది. బాలభాను అర్చక, పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న యాగ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు గురువారం సహస్ర సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం దేవసేన సుబ్రహ్మణ్యం స్వామి కల్యాణం వైభవంగా జరిపారు. వేద పండితులు అమ్మవారిని, పరమేశ్వరుడిని కొలుస్తూ యాగం చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.



చండీ సహిత సుదర్శన యాగంలో భక్తులు

గురజాడ అప్పారావు జయంతి వేడుకలు రేపు

డాబాగార్డెన్స్: మహాకవి గురజాడ అప్పారావు 162వ జయంతి వేడుకలు ఈ నెల 21న పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. గురజాడ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో స్థానిక అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరగనున్న వేడుకల పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు మాట్లాడుతూ శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కవితలు, హోలా హప్ పోటీలు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాంస్కృతిక ప్రదర్శనలు, జయంతి సభ అనంతరం పోటీలో పాల్గొన్న కళాకారులు, విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఎన్.నాగేశ్వరరావు, సభ్యులు వై.అప్పారావు, ఫ్రాన్సిస్, ఎల్లాజీ, అబ్దుల్ అహ్మద్, అష్రాఫ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ



కుట్టు శిక్షణలో మహిళలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని బార్జిలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం మూడు నెలల పాటు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నారు. కొత్త బ్యాచ్ గురువారం నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డు దరి డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రారంభమైంది. బ్యాచ్‌కు ఐదుగురు మహిళలు వంతున రోజుకు రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నామని ఫౌండేషన్ అధినేత దుంగి చంద్రగిరి రెడ్డి, మజ్జి కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు, ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద మహిళలకు పది కుట్టుమిషన్లు అందజేశామని చెప్పారు.

జోన్-3 కమిషనర్‌గా శివప్రసాద్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శివప్రసాద్

సీతమ్మధార: జీవీఎంసీ జోన్-3 కమిషనర్‌గా కె.శివప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏలేశ్వరం కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు. గతంలో ఇదే జోన్ కమిషనర్‌గా పని చేసి బదిలీపై జోన్-4 కమిషనర్‌గా కొంతకాలం పనిచేసి, ఏలేశ్వరం మున్సిపల్ కమిషనర్‌గా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఆశీలమెట్ట జోనల్ కార్యాలయంలో కొత్త జెడ్సీగా బాధ్యతలు చేపట్టిన శివప్రసాద్‌ను పలు విభాగాల అధిపతులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. వారిలో పబ్లిక్ వర్క్స్ ఈఈ డి.వి.రమణమూర్తి, ఏసీపీ ఎస్.వెంకటేశ్వరరావు, సహాయ వైద్యాధికారి ప్రసాదరావు, యూసీడీ ఏపీడీ దుర్గాప్రసాద్, రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్ ఎం.రమేష్, మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

నెహ్రూనగర్‌లో అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న స్థానికులు

ఆరిలోవ: వినాయక ఉత్సవాల్లో భాగంగా గురువారం జీవీఎంసీ 12వ వార్డులో అన్నసమారాధన నిర్వహించారు. ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు కంచర్ల అచ్యుతరావు భక్తులకు భోజనాలు వడ్డించారు. నెహ్రూనగర్‌తోపాటు టీవీసీ పాయింట్, లీలాసుందరినగర్, దుర్గానగర్ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి ప్రసాదం స్వీకరించారు. స్థానిక నాయకులు పొట్టి అప్పారావు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో భార్గవ్‌కు రజతం



భార్గవ్‌ను అభినందిస్తున్న మధుకుమార్ తదితరులు

సీతంపేట: కోనసీమ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఇటీవల నిర్వహించిన ఛాంపియన్‌షిప్ పోటీల్లో బుల్లయ్య కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి పి.భార్గవ్ 120 కిలోల విభాగంలో రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

ఓజోన్ పొర రక్షణ.. అందరి బాధ్యత



గొడుగులు పట్టుకుని ర్యాలీ చేస్తున్న డీఈవో చంద్రకళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆరిలోవ: ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని జిల్లా విద్యాశాఖాధికారి లెంక చంద్రకళ అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సాంకేతిక మండలి విశాఖపట్నం, తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులతో కలసి ఓజోన్‌పై అవగాహన కోసం గొడుగులు పట్టుకొని ర్యాలీ చేపట్టారు. ఓజోన్ పొరను కాపాడుకోవాలి.. అందరూ బాధ్యతతో మెలగాలి అంటూ నినాదాలు చేశారు. పాఠశాల నుంచి తోటగరువు వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ఓజోన్ పొర ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. జీవావరణానికి ఓజోన్ పొర రక్షణ కవచంగా ఉందన్నారు. ఓజోన్ దెబ్బతినడం వల్ల వాతావరణంలో మార్పులు వస్తున్నాయన్నారు. సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు నేరుగా భూతావరణంలో ప్రవేశించి, భూమి ఓడెక్కడంతోపాటు అనేక రకాల వ్యాధులు వస్తాయన్నారు. ఓజోన్ పొర దెబ్బతింటే సకల జీవరాశుల మనుగడ ప్రమాదంలో పడుతుందని చెప్పారు. దీన్ని రక్షించుకోడానికి అందరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఏపీకాస్ట్ జిల్లా సమన్వయాధికారి పి.రాజారావు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం టి.రామకృష్ణ, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు చంద్రాజీ, స్వామినాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ జాన్ ప్రసాద్, సభ్యులు అనురాధ, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

‘మాతృ మరణాలు సంభవించరాదు’

మహారాణిపేట: మాతృ మరణాలు సంభవిస్తే ఆ ప్రాంత వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని, యూపీహెచ్‌సీలను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఇటీవల బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ పరిధిలో ఒక మాతృ మరణం సంభవించిందని, దీనిపై సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. ప్రతి గర్భిణిని సంబంధిత యూపీహెచ్‌సీలో చూపించాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్య కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జీవన్ రాణి, విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష, అగనంపూడి ఏరియా ఆస్పత్రి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎస్.షర్మిల కుమారి, వైద్యులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మాధురి, డాక్టర్ వర్ణిక, డాక్టర్ ఎస్.సి.బి.నాయుడు, జిల్లా మీడియా విస్తరణాధికారి ఎం.నాగేశ్వరరావు, డాక్టర్ రేవతి, డాక్టర్ జి.శారదాదేవి, ఎం.శ్రీకళ, ఐ.మనోరమ, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



మాతృ మరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

వాల్తేరు డిపో యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

ఎంవీపీకాలనీ: ఆర్టీసీ వాల్తేరు డిపో మేనేజర్, యాజమాన్యం తీరు, ఉద్యోగుల సమస్యలపై ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. డిపో యాజమాన్యం తీరుకు నిరసనగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఉద్యోగులు కొంతకాలంగా డిపో ఎదుట దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. యాజమాన్యం పట్టించుకోకపోవడంతో తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ విశాఖ జిల్లా వాల్తేర్ డిపో కార్యదర్శి వసంతరావు తెలిపారు. వాల్తేరు డిపో కండెక్టర్ అక్రమ సస్పెన్షన్‌ను నిరసిస్తూ డిపో మేనేజర్ వైఖరికి వ్యతిరేకంగా దాదాపు 40 రోజుల నుంచి ఉద్యోగులు నిరసన తెలుపుతున్నా.. యాజమాన్యం పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. విశాఖ డీపీటీవో కక్షపూరితంగా వ్యవహరిస్తూ కండక్టర్లు, డ్రైవర్లను అక్రమ సస్పెన్షన్లు చేసేలా ఆదేశాలిస్తూ ప్రతి డిపోలో సమస్యలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో డిపో యాజమాన్య వైఖరిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. కండక్టర్‌పై డీఎం సస్పెన్షన్‌ను ఎత్తివేసి వాల్తేర్ డిపో పరిధిలోనే ఆయనకు తిరిగి ఉద్యోగ బాధ్యతలు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను ఎన్‌ఎంయూఏ ప్రతినిధులు కోరారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు గండి రామకృష్ణ, కార్యదర్శి బి.నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెలగపూడికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఏయూ విభాగాల సందర్శన

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల పరిధిలోని పలు విభాగాలను గురువారం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు సందర్శించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావుతో కలిసి సోషల్ సైన్సెస్ భవనంలోని సోషల్ వర్క్, సోషియాలజీ, జర్నలిజం విభాగాల్లో తనిఖీలు చేశారు. తరగతులు జరుగుతున్న విధానం, హాజరు పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ విద్యార్థులతో ముచ్చటించారు. ఏయూ గ్లోబల్ వర్సిటీగా నిలుస్తోందన్నారు. విదేశీ విద్యార్థులు సైతం ఈ విభాగాల్లో విద్యను అభ్యసిస్తుండటాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వీసీ వెంట అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీమన్నారాయణ ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు

చిరస్మరణీయుడు తాపీ ధర్మారావు

విశాఖ సిటీ: సమాజం నిత్యం స్మరించుకోదగ్గ వ్యక్తి తాపీ ధర్మారావు అని తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అన్నారు. ఆంధ్ర విశారద తాపీ ధర్మారావు జయంతి రోజున తెలుగు మాధ్యమాల దినోత్సవం సందర్భంగా గురువారం ఏయూ తెలుగు విభాగంలో సాహిత్య గోష్ఠి నిర్వహించారు. ధర్మారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జర్రా అప్పారావు మాట్లాడుతూ తాపీ ధర్మారావు అనేక రచనలు చేసి సమాజాన్ని చైతన్య పరిచిన నిత్య పరిశీలనశీలని పేర్కొన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ తెలుగు సాహిత్య పరిశోధన, విమర్శలో మహా మేధావి తాపీ ధర్మారవు అని కొనియాడారు. కార్యక్రమంలో ఆచార్య అరుణ్‌కుమార్, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ వెంకటేశ్వరులు, డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్నశేఖర్, డాక్టర్ గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తాపీ ధర్మారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆచార్య జర్రా అప్పారావు తదితరులు